సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం ၊ 18 ၊ మార్చి ၊ 2024



ఆలయ కమిటీ సమావేశం
పాడేరు మోదకొండమ్మ జాతర తేదీలు నిర్ణయించేందుకు ఆదివారం ఆలయ కమిటీ . గ్రామ పెద్దలు సమావేశమయ్యారు.



ఘనంగా ఆర్జిత సేవలు
సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారి నిత్య కల్యాణ్యం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

రంజాన్ వేళలు

పాడేరు, అరకు	
ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
6.11	4.47
రంపచోడవరం	
6.09	4.46

న్యూస్‌రీల్

వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు



రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి తనూజరాణి, వినయ్ దంపతులు

సాక్షి, పాడేరు: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్న దొర, జిల్లా ఇన్చార్జి మంత్రి అమర్నాథ్‌లను ఆదివారం వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మా తనూజరాణి మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు వారిని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె భర్త వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్ పాల్గొన్నారు

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 59 శాతం హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అశోక్

విశాఖ విద్య: గ్రూప్ -1 ప్రిలిమ్స్ స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో పరీక్షలు జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌గా జరిగిన పరీక్షకు మొత్తం 19,664 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 11,679 మంది హాజరయ్యారు. జిల్లాలో 59 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 7,985 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని ప్రభుత్వ మహిళ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

ముమ్మరంగా తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎటపాక: ఎన్నికల కోడ్ అమలు కావడంతో ఆంధ్రా, తెలంగాణ రాష్ట్ర సరిహద్దుల్లో స్థానిక పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆదివారం కన్నాయిగూడెం వద్ద సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారధి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో తనిఖీలు నిర్వహించారు. పొరుగు రాష్ట్రాల నుంచి ఆంధ్రాలోకి ప్రవేశించే ప్రతీ వాహనాన్ని ఆపి క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల రికార్డులను పరిశీలించి ప్రయాణికుల వివరాలు తెలుసుకున్నారు. అనుమానితుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఎన్నికల నగారా మోగడంతో చర్ల రోడ్, కూనవరం రోడ్డు రాష్ట్ర సరిహద్దులో ఆంధ్రా, తెలంగాణ పోలీసులు ప్రత్యేక పికెట్లు ఏర్పాటు చేసి తనిఖీలు ముమ్మరం చేశారు.

టీడీపీకి రంపపు కోత



పరిశీలకుడు నిర్వహించిన సమావేశానికి హాజరైన టీడీపీ శ్రేణులు



చంద్రబాబును కలిసేందుకు వెళ్తూ కన్నీరు పెట్టుకున్న వంతల రాజేశ్వరి

రంపచోడవరం టీడీపీలో అసమ్మతి రాజుకుంది. అసెంబ్లీ టికెట్ కేటాయింపులో సీనియర్లను అధిష్టానం పక్కనబెట్టడంతో ఆ పార్టీ శ్రేణులు గ్రూపులుగా విడిపోయాయి. పార్టీ పరిస్థితిని తెలుసుకునేందుకు వచ్చిన పరిశీలకుడి వద్ద మాజీ ఎమ్మెల్యే వంతల వర్గీయులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

- శిరీషాదేవి అభ్యర్థిత్వంపై పెరుగుతున్న అసంతృప్తి
- గ్రూపులుగా చీలిపోయిన పార్టీ శ్రేణులు
- చంద్రబాబు ఇంటివద్ద కన్నీటి పర్యంతమైన వంతల రాజేశ్వరి

రంపచోడవరం: రంపచోడవరం అసెంబ్లీకి టీడీపీ అభ్యర్థిగా మిరియాల శిరీషా దేవిని అధిష్టానం ప్రకటించడం ఆ పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. గ్రూపులుగా చీలిపోయిన పార్టీ శ్రేణులను ఒక తాటిపైకి తెచ్చేందుకు అధిష్టానం చేసిన ప్రయత్నాలు ఏమాత్రం ఫలించలేదు. ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు విజయవాడలోని చంద్రబాబు ఇంటి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. దీంతో దిగి వచ్చిన అధిష్టానం పార్టీ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్‌ను పంపించడంతో శనివారం ఆయన నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్న ఆయన అధిష్టానానికి నివేదిస్తామని చెప్పారు. టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఈ సమావేశంలో తన అనుచరులతో బలప్రదర్శనకు దిగారు. పార్టీ కోసం ఇన్నాళ్లు కష్టపడిన తనకు టికెట్ ఇవ్వకపోవడం సరికాదని ఆమె ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. అంతేకాకుండా మిరియాల శిరీషా భర్త భాస్కర్‌పై ఉన్న కేసులు, ఉద్యోగాలు ఇప్పిస్తానని గిరిజన యువత నుంచి డబ్బులు వసూళ్లు తదితర అంశాలను పార్టీ పరిశీలకుడి దృష్టికి కొంతమంది నాయకులు తీసుకువెళ్లినట్టు సమాచారం. ఇలాంటి అంశాలన్నీ దెబ్బతీస్తాయని, ఇప్పటికే ఈ ప్రాంతంలో పార్టీ పరిస్థితి మెరుగ్గా లేదని వారు చెప్పినట్టు తెలిసింది.

దిక్కుతోచని పార్టీ శ్రేణులు!

రంపచోడవరంలో బీజేపీ నేత, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయం నుంచి టీడీపీ అభ్యర్థి మిరియాల శిరీషా దేవి కార్యకలాపాలు నిర్వహించడాన్ని మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి అనుచరులు జీర్ణించుకోలేకపోతున్నారు. మరోపక్క శిరీషా దేవి, వ్యతిరేక వర్గం వేర్వేరుగా మీడియా సమావేశం నిర్వహించడం పార్టీ శ్రేణులకు దిక్కు తోచడం లేదు.

'వంతల'కు బాబు దగా!

రంపచోడవరం నియోజకవర్గం నుంచి 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున విజయం సాధించిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆకర్ష్‌లో భాగంగా టీడీపీలో చేరారు. దీంతో ప్రజల విశ్వాసం కోల్పోయిన ఆమె ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న ఆమెకు టికెట్ కేటాయింపు విషయంలో చంద్రబాబు మొండిచెయ్యి చూపారు. దీంతో ఆమె నైరాశ్యంలో కూరుకుపోయారు.

టెన్త్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- జిల్లావ్యాప్తంగా 65 కేంద్రాల ఏర్పాటు
- 12,051 మందికి హాల్ టికెట్ల పంపిణీ
- పూర్తిస్థాయిలో బందోబస్తు, సీసీ కెమెరాల ఏర్పాటు

కంట్రోల్ రూం నంబర్లు:
9490204585, 9493426468



పాడేరు ఉన్నత పాఠశాల సెంటర్‌లో ఏర్పాటు చేసిన బెంచీలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేలా కలెక్టర్ విజయ సునీత చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 65 పరీక్షా కేంద్రాలను విద్యాశాఖ ఏర్పాటు చేసింది. అన్నిచోట్ల బెంచీల సౌకర్యం కల్పించారు. ఫ్యాన్లు, సురక్షిత ఫ్యాన్లు, సురక్షిత తాగునీటిని అందుబాటులోకి తెచ్చారు. ప్రతి పరీక్ష కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు చేపట్టింది.

హాల్‌టికెట్ల పంపిణీ పూర్తి

జిల్లాలోని 65 పరీక్షా కేంద్రాల్లో 12,051మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికి ఇప్పటికే హాల్ టికెట్లు అందజేశారు. వీరిలో 10,986 మంది రెగ్యులర్, 1065 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారు. బాలికలు 5,920 మంది, 5,066 మంది బాలురు ఉన్నారు.

- జిల్లా వ్యాప్తంగా ఏర్పాటుచేసిన 65 పరీక్ష కేంద్రాల్లో 64 మంది ఇన్విజిలేటర్లను విద్యాశాఖ నియమించింది. పది రూట్లుగా విభజించి నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 65 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, మరో 65 మంది డీవోలను ఏర్పాటుచేసింది. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. సీసీ కెమెరాలను అమర్చారు.

హాల్‌టికెట్ చూపిస్తే ప్రయాణం ఉచితం

జిల్లాలో టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసీ సంస్థ ఉచిత బస్సు ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకు సంబంధించి కలెక్టర్, సబ్‌కలెక్టర్లు, పాడేరు ఆర్టీసీ డీఎంకు ఆదేశాలు ఇచ్చారు. మండల కేంద్రాల్లోని ఆశ్రమ పాఠశాలలు, గురుకుల విద్యాలయాల విద్యార్థులకు రవాణా సౌకర్యం ఏర్పాటుచేశారు. హాల్ టికెట్‌ను చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ అధికారవర్గాలు తెలిపాయి.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు



టెన్త్ పబ్లిక్, ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు సంబంధించి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశాం. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాలల హెచ్ఎంలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చి సాయం పొందవచ్చు.

– బ్రహ్మాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి, పాడేరు

ఎన్నికల వేళ.. చెక్‌పోస్టుల ఏర్పాటు

- అమల్లోకి కోడ్
- నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సిందే
- ఎస్పీ తుహిన్ సిన్హా



ఎస్పీ తుహిన్ సిన్హా

పాడేరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రాజకీయ పార్టీల అభ్యర్థులు, ఉద్యోగులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని పాటించాలని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ మేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు. జిల్లావ్యాప్తంగా ఐదు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, ఆరు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు, 22 మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ బృందాలు, 17 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటుచేశామని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సభలు, సమావేశాలు, లౌడ్ స్పీకర్ల ఏర్పాటుకు ముందస్తు అనుమతి పొందాలని సూచించారు. ఇందుకు దరఖాస్తు చేసుకుంటే సింగిల్ విండో విధానం ద్వారా తక్షణమే అనుమతులు మంజూరు చేస్తామనిని తెలిపారు. బరిలో ఉన్న అభ్యర్థులు వారి ఖర్చు వివరాలను సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు.

- ఓటర్లకు ఎటువంటి నగదు, మద్యం, డ్రగ్స్, ప్రలోభపరిచే బహుమతులు ఇవ్వకూడదన్నారు. ఎవరైనా అలా చేస్తూ పటుబడితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పనవి హెచ్చరించారు. ఎవరైనా రూ.50 వేలకు మించి నగదు, రూ.10 వేల విలువైన వస్తులను తీసుకువెళ్లేందుకు అవకాశం లేదన్నారు.
- జిల్లా అంతా మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావడంతో భద్రత కారణాల దృష్ట్యా అభ్యర్థులు ప్రచారానికి ఎక్కడికి వెళ్తుంది రెండు రోజుల ముందుగానే పోలీస్ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు.
- ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, నిజాయితీతో పని చేయాలని ఎస్పీ సూచించారు. ఉద్యోగులు ఎవరైన రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అనుకూలంగా వ్యవహరిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.
- సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగిస్తే ఎన్నికల నియమావళి ఉల్లంఘన ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని, ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నియమావళి అమలు

- ఆర్వోలకు కలెక్టర్ విజయ సునీత ఆదేశాలు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులంతా ఎన్నికల కమిషన్ జారీ చేసిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని పకడ్బందీగా అమలు జేయాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, అరకులోయ నియోజకవర్గాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ జారీ చేయడంతో శనివారం నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. 24గంటల్లోగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో రాజకీయ నాయకుల ఫొటోలు,ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు, పబ్లిక్ ప్రదేశాల్లోని రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు కూడా వెంటనే తొలగించాలని సూచించారు. జాతీయ నేతలు మినహా,అన్ని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, అంబులెన్సులు,ఆర్టీసీ బస్‌లు,ఇతర వాహనాలపై ఉన్న ఫొటోలను కూడా తొలగించాలన్నారు. త్వరలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని నియోజకవర్గాల ఆర్వోలు తగిన ఏర్పాట్లలో నిమగ్నమవ్వాలని సూచించారు. లయన్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వలెన్స్ టీమ్‌లే క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటనలు జరిపి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని ఆదేశించారు.అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాడేరు,రంపచోడవరం,అరకులోయ ఆర్వోలు భావన, ప్రశాంత్‌కుమార్, వి.అభిషేక్, డీఆర్వో పద్మావతి, ఎంసీసీ నోడల్ అధికారి శివయ్య, ఎస్‌డీసీ అంబేద్కర్ పాల్గొన్నారు.

హాయ్.. కియారా



కొమ్మాది: ఆర్.కె. బీచ్‌లో నటి కియారా అద్వానీ ఆదివారం సందడి చేశారు. ఇక్కడ పరిసర ప్రాంతాల్లో ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. తోటి నటీనటులతో ఆమె షూటింగ్‌లో పాల్గొన్నారు. పొలిటికల్, యాక్షన్, థ్రిల్లర్ కథాంశాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ హీరోగా, కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై ఈ సినిమా నిర్మిస్తున్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పాల్గుణ, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు



పాడేరులో వర్తక సంఘ నేతలతో చెట్టి పాల్గుణ, విశ్వేశ్వరరాజు

సాక్షి, పాడేరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్డులోని వర్తక సంఘం నాయకులతో ఆదివారం రాత్రి వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు అన్ని వర్గాల ప్రజలు తమ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. జిల్లాలో అరకు ఎంపీగా గుమ్మా తనూజరాణి, అరకు, పాడేరు, రంపచోడవరం ఎమ్మెల్యేలుగా రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, నాగులాపల్లి ధనలక్ష్మిని భారీ మెజారిటీ గెలిపించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్తక సంఘం నాయకులు ఇమ్మిడిశెట్టి అనిల్ కుమార్, సత్యనారాయణరాజు, సత్తిబాబు, బూరెడ్డి కొండబాబు, వైఎస్సార్‌సీపీ నేతలు కిల్లో రామకృష్ణ, వంతాల అప్పారావు పాల్గొన్నారు.

బొర్రా గుహలు 1200 మంది సందర్శన

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకుల రాక తగ్గింది. ఆదివారం బొర్రాగుహలను 1200 మంది తిలకించారు. తాటిగుడ, కటికి, కాఫీ ప్లాంటేషన్, డముకు వ్యూపాయింట్ తదితర పర్యాటక ప్రాంతాలన్నీ వెలవెలబోయాయి. టెన్త్ పరీక్షల నేపథ్యంలో రాక తగ్గిందని స్థానికులు తెలిపారు.

సరిహద్దుల్లో నిఘా



పాడేరులో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద ఎస్ఈబీ పోలీసులు



చట్టీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ అధికారులు



దాడుల్లో ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా బస్తాలు

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అధికారుల కసరత్తు
- సారా, మద్యం అక్రమ రవాణాపై దాడులు..పలువురి అరెస్టు
- ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ ముందస్తు చర్యలు

పాడేరు : ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. మద్యం, సారా ప్రభావం లేకుండా ఉండేందుకు ఎస్ఈబీ, టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా పటిష్ట చర్యలు చేపట్టారు. జిల్లాలో 22 మండలాలు ఉండగా పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం, చింతూరులో ఎస్ఈబీ స్టేషన్లు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలానికి ఒక సీఐ, ఎస్ఐ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించారు. వీరు మద్యం, అక్రమ రవాణా, సారా తయారీ, అమ్మకాలు తదితర అంశాలకు సంబంధించి సమాచారం సేకరించి దాడులు నిర్వహిస్తున్నారు. గతంలో పట్టుబడిన నిందితులకు కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేస్తున్నారు.

ఏడు చోట్ల చెక్ పోస్టులు

ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు ఎస్ఈబీ ఉన్నతాధికారులు జిల్లాతో పాటు అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో ఏడు చోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ప్రధానంగా చింతూరు స్టేషన్ పరిధిలో నెల్లిపాక, చట్టీ, కల్లేరు (మోటు), పాడేరు స్టేషన్ పరిధిలో పాములాయి, రంపచోడవరం స్టేషన్ పరిధిలో రంపచోడవరం, జైపూర్, చిత్రకొండ ప్రాంతాల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా జిల్లా వ్యాప్తంగా ఇంటిలిజెన్స్ వింగ్, మొబైల్ టీంలు దాడులు నిర్వహిస్తున్నాయి

దాడులతో సత్ఫలితాలు

జిల్లా వ్యాప్తంగా ఎస్ఈబీ అధికారులు చేపట్టిన సత్ఫలితాలిస్తున్నాయి. ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు తర్వాత జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 865 లీటర్ల నాటుసారా, 34 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివిధ కేసుల్లో 12 మందిని అరెస్టు చేశారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు



త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మద్యం, సారా ప్రభావం లేకుండా ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ముందస్తుగా చెక్‌పోస్టులు, మొబైల్ టీంలు ఏర్పాటుచేసి సమాచారం సేకరిస్తున్నాం. దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. గతంలో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించి బైండోవర్ చేసి విడిచిపెడుతున్నాం. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తమ సిబ్బందికి, సచివాలయాల్లోని మహిళా పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– ఎస్.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్, ఎస్ఈబీ, పాడేరు.

దుండగుల అలజడి

కొద్దిరోజులుగా ఆంధ్రా– ఒడిశా సరిహద్దు గ్రామాల్లో మారణాయుధాలతో దుండగులు సృష్టిస్తున్న అలజడి ఖాకీ సినిమాలో సన్నివేశాలను తలపిస్తున్నాయి. అర్ధరాత్రి.. అందరూ నిద్రపోతున్న వేళ.. గుంపుగా గ్రామాల్లోకి చొరబడుతున్నారు. మారణాయుధాలతో భయభ్రాంతులకు గురి చేస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి వస్తున్న వీరు అంతర్రాష్ట్ర ముఠా కావొచ్చన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

- ఆంధ్రా–ఒడిశా సరిహద్దు గ్రామాల్లో హల్‌చల్
- 'ఖాకీ' సినిమాలో సన్నివేశాలను తలపించిన ఆగడాలు
- మారణాయుధాలతో రావడంతో స్థానికుల్లో భయాందోళనలు



ముంచంగిపుట్టులో తనిఖీ చేస్తున్న పోలీసులు



ముంచంగిపుట్టులో దుండగులు చిందరవందర చేసిన బీరువా

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో శనివారం అర్ధరాత్రి దుండగులు సినీఫక్కీలో అలజడి సృష్టించారు. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయుడు జోషెఫ్ ఇంటికి రాత్రి 12 గంటల సమయంలో వచ్చారు. గొడ్డళ్లు, కత్తులతో ఉన్న వారు తలుపులు కొట్టడంతో ఆయన అప్రమత్తమయ్యారు. సుమారు అర్ధగంటసేపు అక్కడే ఉన్నారు. దీంతో అప్రమత్తమైన ఆయన ప్రధాన ద్వారం తలుపులకు అడ్డుగా దివాన్‌కాట్ ఉంచారు. వెంటనే స్నేహితులు, పోలీసులకు ఫోన్‌లో విషయాన్ని తెలియజేశారు. ఇంతలో దుండగులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా జోషఫ్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ దుండగుల వద్ద గొడ్డళ్లు, కత్తులు ఉన్నాయన్నారు. ముఖానికి నల్లని వస్త్రం ధరించి ఉన్నారని, వీరిలో మహిళలు కూడా కనిపించారని వారు పేర్కొన్నారు. తలుపులు కొడుతున్న సమయంలో భయాందోళనకు గురయ్యామని వణికిపోతూ చెప్పారు.

- మండల కేంద్రానికి 14 కిలోమీటర్ల దూరంలో ఒడిశా రాష్ట్ర సరిహద్దులోని మాకవరం గ్రామంలో ఈనెల 11న అర్ధరాత్రి 12 గంటల సమయంలో వ్యాపారి సతీష్ ఇల్లు, దుకాణం తలుపులను బద్దలు కొట్టారు. ఇంట్లో వాళ్లను మారణాయుధాలతో బెదిరించి బీరువాలోని రూ.2.10లక్షల నగదు, నాలుగున్నర తులాల బంగారం పట్టుకుపోయారు.
- ఈనెల రెండవ తేదీన జోలాపుట్టు నుంచి బైక్‌పై వస్తున్న ఒక కాంట్రాక్టర్‌ను సాయంత్రం 4గంటల సమయంలో అడ్డుకున్నారు. అతని వద్ద ఉన్న రూ.5 వేలు లాక్కొని ఉడాయించారు.
- పెదబయలు మండలం రూఢకోటలో పార్శిళ్ల డెలివరీ బాయ్ నుంచి అడ్డుకున్న దుండగులు అతని వద్ద ఉన్న డబ్బులను లాక్కొనేందుకు ప్రయత్నించారు. వెంటనే అతను కేకలు వేయడంతో అక్కడ నుంచి పరారయ్యారు.
- మండల కేంద్రం ముంచంగిపుట్టులోని ఓ కిరాణా దుకాణంలో ఈనెల 12వ తేదీ రాత్రి గొడ్డళ్లతో కటకటాలు తొలగించారు. ఇంట్లోని విలువైన సామాన్లు పట్టుకుపోయారు. ఇలా కొద్ది రోజులుగా దుండగులు గ్రామ శివారు ప్రాంతాల్లో అలజడి సృష్టిస్తుండటంతో ఇరు రాష్ట్రాల పోలీసులు సరిహద్దుల్లో గస్తీ పెంచాలని స్థానికులు కోరుతున్నారు. వీరి ఆగడాలపై పోలీసులు కూడా దృష్టి సారించారు. అంతర్రాష్ట్ర ముఠా కావొచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

తనిఖీలు ముమ్మరం

మండల కేంద్రంలో తనిఖీలు ముమ్మరం చేశామని జి.మాడుగుల సీఐ రమేష్ తెలిపారు. రాత్రిపూట రాకపోకలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, దుండగులకు సంబంధించిన ఎటువంటి సమాచారం తెలిసినా తమకు తెలియజేయాలని ఆయన కోరారు.

చెట్టను ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లిన బొలేరో



వంతాల లవకుశ మృతదేహం



చెట్టుకు ఢీకొని నుజ్జుయిన వాహనం

- ఒకరి మృతి, ఇద్దరికి స్వల్ప గాయాలు
- విశాఖలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

పెదబయలు: మండలంలోని అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామ సమీప మలుపు వద్ద బొలేరో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. ముంచంగిపుట్టు మండలం బరడ పంచాయతీ బొడ్డాపుట్టు గ్రామానికి చెందిన వంతాల లవకుశ(51)తో పాటుగా మండలానికి చెందిన మరో ఐదుగురు ఈ నెల 16న విశాఖలో కాంగ్రెస్ పార్టీ సమావేశానికి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి వస్తుండగా రాత్రి 2 గంటల సమయంలో చుట్టుమెట్ట గ్రామ సమీపంలో మలుపు వద్ద ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టుకు ఢీకొట్టి లోయలోకి దూసుకెళ్లింది. దీంతో వంతాల లవకుశకు తల, ఛాతీ భాగాలకు తీవ్రంగా గాయాలవ్వడంతో 108 ఫోన్ చేయడంతో అంబులెన్స్‌లో హుటాహుటిన పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మలుపు వద్ద వేగంగా రావడం వల్లే అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిందని క్షతగాత్రులు తెలిపారు. మృతుడికి భార్య, ఐదుగురు పిల్లలున్నారు. కుటుంబ పెద్ద దిక్కు చనిపోవడంతో వారు బోరున విలపించారు. ఈ విషయంపై కేసు నమోదు చేశామని, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించామని ఏఎస్ఐ లక్ష్మణరావు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

జి.మాడుగుల: చింతపల్లి వెళ్లే రోడ్డు మార్గంలో పాలమామిడి బ్రిడ్జి వద్ద ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి, ఈ ప్రమాద సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతపల్లి మండలం కొమ్మంగి పంచాయితీ పెద్దూరు గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు, ఒక మహిళ బైక్‌పై పాడేరు వెళ్తుండగా తమ్మంగుల గ్రామం నుంచి ఓ యువకుడు బైక్‌పైన ఎదురెదురుగా వస్తూ పాలమామిడి బ్రిడ్జి వద్ద రెండు బైక్‌లు ఢీ కొన్నాయి. రెండు బైకులు నుజ్జునుజ్జయయ్యాయి, కేబీ ఫౌండేషన్‌కు చెందిన సభ్యులు ఫోన్ ద్వారా అంబులెన్సుకు సమాచారం అందించారు. క్షతగాత్రులను పాడేరు ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం తరలించారు, ఈ సంఘటనపై సమాచారం అందలేదని పోలీసులు చెప్పారు. క్షతగాత్రుల పేర్లు, వివరాలు తెలియాల్సి ఉంది.



సంఘటనలో తీవ్రంగా గాయపడిన యువకులు

మారేడుమిల్లి: మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకు అదుపుతప్పి పడి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. జగ్గంపేట గ్రామానికి చెందిన కె.సురేష్, ఆర్.అశోక్ అనే ఇద్దరు యువకులు బైకుపై మారేడుమిల్లి విహారయాత్రకు వచ్చారు. ఇక్కడి ప్రదేశాలను తిలకించి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా మండలంలోని సున్నంపాడు గ్రామం దాటిన తరువాత మలుపులో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి బైకు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బైకు నడుపుతున్న సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతనిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చెరకు రైతు సజీవ దహనం

బుచ్చెయ్యపేట: మండల కేంద్రం బుచ్చెయ్యపేటకు చెందిన సుంకర పోతురాజు(68) అనే రైతు మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. ఆయన ఆదివారం తన పొలంలో చెరకు చెత్తకు నిప్పు పెట్టాడు. పక్కనున్న చెరకు తోటలకు కూడా ఆ మంటలు వ్యాపించాయి.

మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించగా గాలికి పెద్ద ఎత్తున ఎగిసిపడిన మంటలు పోతురాజు చుట్టూ వ్యాపించడంతో సజీవ దహనమైనట్టు గ్రామస్తులు తెలిపారు. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేరని చెప్పారు. పోతురాజుకు భార్య చెల్లయమ్మ, వివాహమైన ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు బుచ్చెయ్యపేట ఎస్ఐ డి.ఈశ్వరరావు సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టానికి అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

గీత దాటితే వేటే..



- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమల్లోకి ఎన్నికల కోడ్
- సామాన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ కోడ్ పాటించాల్సిందే..
- రూ.50 వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపించాల్సిందే..

సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక సమర సంరంభం మొదలైంది. ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జరిగే పనులను పర్యవేక్షించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంటుంది. కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ పార్టీలు అనుసరించాల్సిన నియమాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున వెల్లడించారు.

సాధారణ ప్రవర్తనా నియమావళి

- విభేదాలు, వైషమ్యాలు, పరస్పర ద్వేషాలు, కులాలు, మతాలు, జాతుల మధ్య రగిల్చే కార్యక్రమాల్ని అభ్యర్థులు నిర్వహించకూడదు.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకే అభ్యర్థులు ప్రచారం చేయాల్సి ఉంటుంది.
- రాత్రి 10 నుంచి ఉదయం **6 గంటల వరకు** ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులో ఉంటుంది.
- రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు మసీదు, చర్చి, ఆలయాల వంటి మత పరమైన ప్రదేశాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదు.
- అభ్యర్థులు తమ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితంపైన, కుటుంబంపైన ఎలాంటి విమర్శలు, ఆరోపణలు చేయకూడదు.
- ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేయకూడదు.
- ఓటరు కాని వారు ఓటు వేసేందుకు యత్నిస్తే నేరం. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు ఏర్పాటు చేయకూడదు.
- పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీల ప్రతినిధులు ఓటర్లను తరలించకూడదు.
- ఇళ్లు, స్థలాల యజమాని అనుమతి లేకుండా పార్టీకి చెందిన బ్యానర్లు, జెండాలు, ఫెక్సీలు, హోర్డింగులు పెట్టడానికి వీల్లేదు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉండవిక

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి వీల్లేదు.
- ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకాలను కూడా ప్రకటించడానికి వీల్లేదు. సర్కారు తరఫున ఏ పని చేయాలన్నా ఎన్నికల కోడ్ రూల్స్‌కు లోబడే చేయాల్సి ఉంటుంది.
- **ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఇప్పటికే** బస్టాండ్లు, రైల్వేస్టేషన్లతో పాటు ఎయిర్ పోర్టుల్లో ఏర్పాటు చేసిన ప్రకటనలను తొలగించాల్సిందే.
- ప్రభుత్వ డబ్బులతో టీవీలు, పేపర్లలో కూడా ఎలాంటి ప్రకటనలు ఇవ్వటానికి వీల్లేదు.
- ఉద్యోగాలు ఇవ్వటం, ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వటం లాంటివి కూడా చేయకూడదు.
- మంత్రులు కూడా తమ అధికారిక హోదాల్లో పర్యటనలు చేయటానికి వీల్లేదు. అంటే.. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా వారికి ప్రభుత్వం తరఫున కేటాయించిన వాహనాలు, భవనాలు ఉపయోగించకూడదన్న మాట.

ముందస్తు అనుమతి తప్పనిసరి

- ఎన్నికల ప్రచారంలో పెద్ద పెద్ద లౌడ్ స్పీకర్లు ఉపయోగించాలనుకుంటే.. ముందుగానే స్థానిక అధికారుల అనుమతి తీసుకోవాలి.
- ఎన్నికల ర్యాలీలకు ముందు ఆయా పార్టీల నేతలు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి, అందుకు అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి.
- ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టిబొమ్మలను తీసుకెళ్లడం, అలాంటివి తగలబెట్టడం నిషేధం.

రూ.50 వేలు మించకూడదు..

- పోటీలో ఉండే అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రాజకీయ పార్టీల కార్యకర్తలు రూ.50 వేలకు మించి డబ్బులు, రూ.10 వేల కంటే ఎక్కువ విలువైన వస్తువులను రవాణా చేయటం నిషేధం.
- **రూ.50 వేలకు మించి తీసుకు వెళ్లాల్సి వస్తే..** కచ్చితంగా ఆ నగదుకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.
- పార్టీల స్టార్ క్యాంపెయినర్లు రూ.లక్షకు మించి నగదు కలిగి ఉండకూడదు.
- పరిమితికి మించి డబ్బులు రవాణా చేస్తున్న వాహనాలను కూడా ఆ డబ్బులతో పాటుగా సీజ్ చేస్తారు.
- ఇక మద్యం కూడా ఎక్కువగా తీసుకెళ్లడానికి వీల్లేదు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయనున్నారు. 1950 కాల్ సెంటర్‌తో పాటు వెబ్‌సైట్ ఆధారంగా ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఫిర్యాదులపై ప్రతిరోజు సాయంత్రం 5 గంటల లోగా జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఫిర్యాదులన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయంతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో బృందాలు, మొబైల్ బృందాలను ఏర్పాటు చేస్తారు. డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా విస్తృత స్థాయిలో తనిఖీలను ప్రారంభిస్తారు. ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై ఫిర్యాదులొస్తేనే చర్యలు తీసుకుంటారు. అవసరమైతే ఫిర్యాదులపై సైబర్ పోలీసులు చర్యలు తీసుకోనున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ సంస్థలలో రాజకీయ పరమైన పోస్టింగ్‌లపై కూడా నిఘా **ఉంటుంది.**

మరుగుతున్న సాంబారు పడి బాలికకు గాయాలు

యలమంచిలి రూరల్: ఇంట్లో పొయ్యిపై మరుగుతున్న సాంబారు పడి మూడేళ్ల పాప లోహిత గాయపడిన ఘటన మండలంలోని లైనుకొత్తూరు రామకృష్ణాపురం కాలనీలో ఆదివారం రాత్రి జరిగింది. ఆడుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్టు బాలిక తల్లి తెలిపింది. పాపకు యలమంచిలి ప్రభుత్వాస్పత్రిలో ప్రథమచికిత్స అందజేశారు. అవసరమైతే మెరుగైన చికిత్సకోసం అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయానికి గాని,విశాఖ కేజీహెచ్‌కు గానీ తరలిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు.



గాయపడిన లోహిత

మా దారి మాదే?

- టికెట్ ఆశించి భంగపడ్డ జనసేన నేతల్లో నైరాశ్యం
- స్వతంత్రులుగా పోటీకి దిగాలని కొందరు..
- పార్టీ మారాలని మరికొందరు యత్నం
- చేజారి పోకుండా ఆ పార్టీ అభ్యర్థుల మంతనాలు



సాక్షి, విశాఖపట్నం : జనసేనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ పార్టీ నేతలు దిక్కులు చూస్తున్నారు. ఒకపక్క టికెట్లు దక్కకపోవడం, మరోపక్క టీడీపీతో పొత్తులో అరకొర సీట్లకే అధ్యక్షుడు అంగీకరించడంపై వీరు ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీ పుట్టుక నుంచి కష్టపడి పనిచేస్తున్న వారిని పక్కనబెట్టేసి నిన్నగాక మొన్న వైఎస్సార్ సీపీ నుంచి జంప్ చేసి వచ్చిన వారికి సీట్లు కేటాయించడం వీరికి అస్సలు మింగుడు పడడం లేదు. పెందుర్తి సీటు పంచకర్ల రమేష్‌బాబుకు, విశాఖ దక్షిణ సీటు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఖరారు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నాళ్లూ అంతా మీరే.. భవిష్యత్తు మీదే.. అంటూ పార్టీ కోసం అన్ని పనులూ చేయించుకుని ఇప్పుడు కరివేపాకుల్లా తీసి పారేశారని సీనియర్లు రగిలిపోతున్నారు. టీడీపీతో పొత్తు ఖరారై, సీట్ల ప్రకటన జరిగాక తమను అస్సలు పట్టించుకోవడమే లేదని వీరు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకే చుక్కెదురు!

విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఉన్నారు. వీరిలో ఒకరు టి.శివశంకర్ కాగా మరొకరు బొలిశెట్టి సత్యనారాయణ. శివశంకర్ పెందుర్తి సీటును, బొలిశెట్టి అనకాపల్లి ఎంపీ స్థానాన్ని ఎప్పట్నుంచో ఆశిస్తున్నారు. ఇప్పుడు వారిద్దరికీ సీట్లు దక్కలేదు. కొన్నాళ్ల క్రితం వరకు 'పెందుర్తి సీటుపై ముందుగా మీతో సంప్రదించాకే నిర్ణయం తీసుకుంటారు' అంటూ జనసేన ముఖ్య నాయకులు శివశంకర్‌కు చెబుతూ వచ్చారు. తీరా ఆ సీటును వైఎస్సార్ సీపీ నుంచి పార్టీ ఫిరాయించిన పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించారు. అనంతరం ఆ పార్టీ మీడియా వ్యవహారాలు చూసే వ్యక్తితో శివశంకర్‌కు ఫోన్ చేయించి సారీ చెప్పించారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన పార్టీకో నమస్కారం పెట్టేసి తిరిగి లాయర్‌గా ప్రాక్టీసు చేసుకుంటానని అనుచరుల వద్ద వాపోయినట్టు తెలిసింది. మరో ప్రధాన కార్యదర్శి బొలిశెట్టిదీ అదే పరిస్థితి. ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు విజయవాడలో అధినేత పవన్‌ను కలవడానికి వెళ్లిన ఆయనకు చుక్కెదురైంది. తాను ప్రధాన కార్యదర్శినని చెప్పినా 'సో వాట్' అంటూ గెంటేసినంత పనిచేశారని, దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెబుతున్నారు.

వారందరికి మొండిచెయ్యి!

విశాఖ దక్షిణ సీటుపై జనసేనలో నలుగురైదుగురు ఆశలు పెట్టుకున్నారు. ఇన్నాళ్లూ వీరు చేతి చమురును భారీగానే వదిలించుకున్నారు. ఇప్పుడు వారిని కాదని వంశీకృష్ణకు కేటాయించారు. ఇక భీమిలి టికెట్టు తనకే ఖాయమైందని సంబరాలు చేసుకున్న పంచకర్ల సందీప్‌ను కూడా 'త్యాగరాజు' జాబితాలో చేర్చేశారు. మరోవైపు విశాఖ ఉత్తర సీటు కోసం ఎదురు చూస్తున్న పసుపులేటి ఉషాకిరణ్‌కూ మొండిచెయ్యే చూపారు. కొన్నేళ్లుగా గాజువాక టికెట్టును ఆశిస్తున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకూ ఝలక్ ఇచ్చారు. అంతేకాదు.. చోడవరం సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రాజుకూ ఆశాభంగమే ఎదురైంది. ఈయన టీడీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని యోచిస్తున్నట్టు సమాచారం. అలాగే ఇప్పటికే అనకాపల్లి సీటునాశించి భంగపడ్డ పరుచూరి భాస్కరరావు జనసేనకు గుడ్‌బై చెప్పేశారు. ఇప్పుడు అక్కడ జనసేన అభ్యర్థిని ఓడించే పనిలో ఉన్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఎవరి దారి వారు చూసుకోవాలని..

తాజా పరిస్థితులతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన శ్రేణులు తీవ్ర నిరుత్సాహంగా ఉన్నారు. జనసేన టికెట్లు ఆశించి భంగపడిన వారు ఆ పార్టీలో ఇంకా కొనసాగేకంటే ఎవరి దారు వారు చూసుకోవాలని యోచిస్తున్నారు. వారిలో కొందరు స్వతంత్రులుగా పోటీ చేసి తమ సత్తా చాటుకోవాలని, మరి కొందరు మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో వైఎస్సార్ సీపీలోకి చేరాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారిని జనసేన జిల్లా, నగర అధ్యక్షులు పంచకర్ల, వంశీకృష్ణలు పార్టీని వీడి వెళ్లవద్దని బతిమలాడుతున్నారు. వారిని చేజారిపోకుండా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి యువకుడికి గాయాలు

మునగపాక : మండలంలోని నాగులాపల్లికి చెందిన యువకుడు ఆదివారం సాయంత్రం చెట్టుపై నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. నాగులాపల్లికి చెందిన ఎంజే నాయుడు ఆదివారం సాయంత్రం పొలంలో పనిచేస్తున్నాడు. సాయంత్రం కొబ్బరి చెట్టు ఎక్కే ప్రయత్నం చేయగా కిందపడిపోయాడు. ఈ సంఘటనలో నాయుడు రెండు చేతులు దెబ్బతిన్నాయి. గెడ్డం దిగువన కూడా దెబ్బలు తగిలాయి. వెంటనే అతడిని అనకాపల్లి వందపడకల ఆస్పత్రికి తరలించగా వైద్యసేవలు అందిస్తున్నారు.

'టెన్'షన్ వద్దు

- మానసిక ఒత్తిడి జయిస్తే విజయం మీదే
- సమయపాలన పాటిస్తే మంచి మార్కులు
- పరీక్షల వేళ ఆరోగ్యం జాగ్రత్త



ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయిరాలు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్నామనేసరికి.. విద్యార్థుల్లో ఎక్కడా లేని ఆందోళన కనిపిస్తుంది. ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే పోటీతత్వంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. 10వ తరగతి పరీక్షలు కీలకం కావడంతో తల్లిదండ్రుల్లోనూ ఇదే ధోరణి ఉంది. పరీక్షల వేళ ఇది ఎంతమాత్రం మంచిది కాదని విద్యావేత్తలు, మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. ముందస్తు ప్రణాళిక అమలు చేసినందున.. విద్యార్థులు భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు భరోసా కల్పిస్తున్నారు.

ఒత్తిడి జయిస్తేనే విజయం

- ఏడాదంతా చదివిన సబ్జెక్టులే అయినందున, ఒత్తిడి జయించి సమయస్ఫూర్తితో పరీక్షలు రాస్తే.. విజయం విద్యార్థుల ముంగిటే ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.
- ప్రశ్నాపత్రం ఇచ్చిన తర్వాత ఏమాత్రం టెన్షన్ పడకూడదు. కొద్దిసేపు ప్రశాంతంగా దానిని చదివి, బాగా వచ్చిన వాటినే ముందుగా రాయడం ప్రారంభించాలి.
- పరీక్ష రోజుల్లో టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటేనే మంచిది. తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలి.

సమయ పాలన కీలకం

- ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.
- ప్రతీ సబ్జెక్టులో వంద మార్కులకు జవాబులు రాయాల్సి ఉన్నందున.. ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలని ముందుగానే గుర్తుంచుకోవాలి. అన్ని ప్రశ్నలకు తప్పనిసరిగా జవాబులు రాసేందుకు ప్రయత్నించాలి.
- గణితం నాకు రాదనే ధోరణి వీడాలి. చిన్నపాటి సూత్రాలను జ్ఞాపకం తెచ్చుకుంటే.. ఈజీగానే జవాబులు రాయవచ్చు. ఫిజిక్స్, బయాలజీలకు వేర్వేరుగా పరీక్ష నిర్వహిస్తున్నందున వీటిని సునాయసంగానే ఎదుర్కొవచ్చు.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



పరీక్షల సమయంలో విద్యార్థులకు ధైర్యం కల్పించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. పిల్లలతో ఎక్కువ సేపు గడపాలి. దూరప్రాంతాల వారు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సద్వినియోగం చేసుకోవచ్చు. పాఠశాలల్లో ఫీజు ఒత్తిళ్లు ఏమైనా ఉన్నట్లయితే కమిషన్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ గొండు సీతారాం, ఏపీఎస్సీపీసీఆర్ సభ్యుడు

ఆందోళన వద్దు



తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నామనే ఆందోళన ఏమాత్రం వద్దు. టెన్షన్ పడితే చదివిందే అయినా, మరిచిపోతాం. ఏడాదంతా స్కూల్లో పరీక్షలు రాసిన విధంగానే ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. పరీక్షల రోజుల్లో ఆరోగ్యం బాగా చూసుకోవాలి. నిర్ణీత సమయం నిద్రపోవాలి.

– డాక్టర్ రాజేశ్వరరావు, మానసిక వైద్యనిపుణులు, విశాఖ పట్నం

50 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు అరెస్టు
- కారు, ద్విచక్ర వాహనం, నాలుగు ఫోన్లు స్వాధీనం



గంజాయి తరలిస్తున్న నిందితులను పట్టుకున్న అన్నవరం ఎస్ఐ రాజారావు, సిబ్బంది

చింతపల్లి రూరల్: కారులో గంజాయిని తరలిస్తున్న నలుగురు నిందితులను పట్టుకున్నట్లు అన్నవరం ఎస్సై పి. రాజారావు ఆదివారం తెలిపారు. వారి నుంచి 50 కిలోల గంజాయి, కారు, ద్విచక్ర వాహనం, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆయన వివరాల మేరకు... చింతపల్లి సీఐ రమేష్‌కు సమాచారం అందడంతో వెంటనే మండలంలో లోతుగెడ్డ బ్రిడ్జివద్ద ఎస్సై తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో కారులో ఒడిశా నుంచి అటవీ ప్రాంతం కోరుకొండ నుంచి లోతుగెడ్డ మీదుగా తునికి గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో తమిళనాడుకు చెందిన రోహన్‌దేవ్ సత్యన్(25), జయశీలన్ కృష్ణన్(47), కాకినాడ జిల్లా తేటగుంటకు చెందిన కటారి రాజు, (36), ముప్పల బాబ్జి(25)లుగా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. పోలీస్, ఏపీఎస్పీ సిబ్బంది పాల్గొన్నారు.